# ఆదర్శం

రచన:
శ్రీ టి. దాదా రెడ్డి

తాను కాలుతూ సైతం, వెలుగునే వెదజల్లుతుంది క్రొవ్వొత్తి. అదే నా ఆదర్శం. నేను ఏమయినా పర్వాలేదు కాని నా తమ్ములు నాలా కాకూడదు. ఎత్తులకు చిత్తయి ఏడువకూడదు. నేను పోయేముందు సెర్చిలైట్‌లా వెళ్లి తమ్ముల్ని వెల్గులో చూస్తాను. డైనామెట్‌లా ప్రేలి వారిని నిద్దురనుండి మేల్కొల్పుతాను. నా స్వార్థంకోసం నన్ను నమ్ముకొన్నవారిని మోసం చేయలేను. అంత నీచానికి దిగజారలేను. సమస్యలతో రాజీపడను ఆశయాలు తీరేవరకూ విశ్రమించను.

హుఁ! మితిమీరుతున్నావ్. ఏదో నీ బాగు కోరి చెపుతున్నాను, ఈ ఐదు వేలు తీసుకొని ఏదయినా వ్యాపారం చేసుకొనీ హాయిగా బ్రతుకు. లక్ష్మి వస్తుంటె తడుకవేసుకోవడం బుద్ధిమంతుని లక్షణం కాదు. నేను చెప్పవల్సినదంతా చెప్పాను, ఇక నీ యిష్టం.

దొరా! ఏడు వేల రూపాయలతో నా కాళ్ళకు బంధం వేసి నీ ఆటలకు అడ్డు రాకుండా చూసుకొని అంధకారంలోని వారిని గాఢాంధకారంలోకి త్రోసివేస్తావా. మిద్దెలపై మిద్దెలు గద్దెలపై గద్దెలు కావాలే కాని నీతి నిజాయితీల నీడ మీకవసరం లేదు. మీలో రాజుకున్న స్వార్థం మిమ్మల్ని దానవునిగా మార్చింది. ఎన్ని దగాలు చేసినా కప్పేందుకు ధనం వుంది. చేయని తప్పులకుకూడా అనుభవించేందుకు మాకేమో అమాయకత్వం ఆసరాగుంది. పేదరికం దాన్ని పటిష్టం చేస్తుంది.

చదువుకొన్నవాడివని కాస్తా చనువిస్తే నన్నే ధిక్కరిస్తున్నావా, అరేయ్ రాములు నీ సంగతేమిటో చూస్తా. నీవేమి చేస్తావో చెయ్యరా. ఈ మారు ఎన్నికలు జరిగేలోపే నీ సంగతీ నా సంగతీ తేలిపోవాలి.

మంచిది అలాగే చూద్దాం. కాని వొక్క మాట, మీరు ఇన్నాళ్ళమాదిరి డబ్బు ఎరగా చూపి మోసగించలేరు,

“అన్నయ్యా! ఎటు వెళ్తున్నావ్”

చావడివద్ద సభ జరుపుకొంటున్నాము ఆచటికే నమ్మా “ఏమి సభలో ఏమో! మీరు ఈమధ్య ఇంట్లోనే ఉండడం లేదు నాన్న కోపానికొస్తున్నారు. అమ్మయినా నాన్నయినా మనకున్నది ఆయనొక్కరే కదా? ఆయన్ని బాధపెట్టే పనిచేయడం మనకు భావ్యం కాదు. ఉపాధ్యాయ వృత్తిలో సతమతమవుతూ నిన్ను బి.ఏ. నన్ను ఇంటర్‌వరకూ చదివించారు. అవి అక్కరకురావని మనకు ఎన్నో ఇంటర్వ్యూలు తెలిపాయి. నాన్నగారు మనల్ని కంటిరెప్పలా కాపాడుతూ ఇంతవాళ్ళను చేసారు. వారికి నేనో తీరని సమస్య నయ్యాను. నా పెళ్ళి గురించి మీ ఉద్యోగం గురించి యోచించని సమయం నాన్నగారికి లేదు. అన్నయ్యా ఇవన్నీ మీకు తెలియవికాదు; నాన్నను అర్థం చేసుకొని మెదులే ప్రయత్నం చేయండి.

ఎందుకే జయా! నీ వెప్పుడూ ఇలాగే మాట్లాడుతావు. నాన్నగారు నీకు పిరికిని నూరిపోసారు. లేనిచో ఇలా ఎందుకు మాట్లాడుతావు. మనకూ మంచి రోజులు వస్తాయి కాని నీలా నీతీ వాక్యాలు వల్లిస్తూ కూర్చుంటే కాదు. మంచి మనుగడకోసం మన సుఖాలు త్యాగం చేయాలి. పేదల్లో చొచ్చుకుపోయి వారి ఆలోచనలకు ప్రేరణ జరిపి ప్రగతిపథాన్ని చూపాలి. మహాత్ములు విసిరిన మంచి మాటలని మనం ఆయుధాలుగా పూని నవసమాజ స్థాపనకై బయలుదేరాలి. అధిగమిస్తే అందనిదేదీ లేదు. ప్రగతి నిరోధకులను పటాపంచలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా వుంది. దాని దృష్టికి స్వార్థపరులను, అవినీతిపరులను, తీసుకురావడానికి మనమంతా బాధ్యతున్న వ్యక్తులమే.

అన్నయ్యా! మీరనేమాటలు కాదనలేను. కాని నాన్నగూర్చి నేననేది. “ఎందుకమ్మా మనకు అన్ని విషయాలు మనదారిన మనము బ్రతుకక, పలానతని అబ్బాయి లంగనట మీటింగులూ అవియివీ ఊళ్ళో అంటుంటే నాగుండె ఆగినట్లవుతుంది. నేనిన్నాళ్ళ నుండి కష్టపడి నిలుపుకున్న మంచి పేరు మంటకలుపు

అందానికి, మన్నికకు
రోజా
REGD No 221631
బనియన్లనే వాడండి

తున్నాడు కదా" అని నాన్నగారు సోది మొదలు పెడతారు. అప్పుడు నాన్నమాటలు నిజమేననిపిస్తాయి. ఇప్పుడు నీ మాటలు నిజమనిపిస్తున్నాయ్. మీ యిద్దరి మద్య నేను నలిగిపోతున్నాను. "నాన్న మాటకు ఎదురు చెప్పలేను, నీవనుసరించే పద్దతి తప్పన లేను" సతమత మయిపోతున్నా నన్నయ్యా.

జయా! ఉన్నవాడు ఏది చేసినా అది మంచి పనే. లేనివాడేది చేసినా తప్పే. వాడిని లంగ అని అనేందుకు సమాజం తయారుగావుంది. దీనికి కళ్ళు లేవు, వినేందుకు మాత్రం చెవులున్నాయి, అనేందుకు నోరుంది. ఈ సమాజం నిజాన్ని కాంచలేదు. నేను వెళ్తున్నాను అంటూనే కదిలాడు రాముడు.

కనుమరు గయ్యేవరకూ అన్నయ్యను చూసి లోనికెళ్ళింది. చిందర వందరగా కదులుతున్న యోచనలు పడుకొనీయలేదు. తండ్రిగారి రాకకయి నిరీక్షిస్తూ కూర్చుంది జయ.

* * *

సోదరులారా! మన మంతా ఇక్కడ సమావేశ మయినది మన బాధలను దూరం చేసుకొనేందుకే. నేనూ మీలోనివాడ్నే కాబట్టి బాధ లెటువంటివన్నది బాగా తెలుసు. ఇవి మనల్ని వీడిపోకపోవడానికి కారణం మనలోని అమాయకత్వం అజ్ఞానం. తరతరాలనుండి చేస్తున్న గులామ్ గిరి, ఇప్పటికికూడా మరువలేం అయితే స్వాతంత్ర్యాన్ని ముప్పాతిప్పలు పడి తెచ్చి మహాత్ములు మనకిచ్చారు. దానిని వినియోగించు కొనే జ్ఞానంలేని మనం ఇలాగే కూర్చుంటే ఇలాగే వుంటాం. స్వాతంత్ర్యం వచ్చి ముప్పై సంవత్సరాలయింది, మనలో మార్పు రాలేదంటే సిగ్గుచేటు. ఎందుకిలా అవుతుందని ప్రతివొక్కరూ యోచించాలి. మెరిసేదంతా బంగార మని నమ్మే మనము ఇప్పటికైన మారాలి. మనలో మార్పు రాకపోతే ఎన్ని హక్కులున్నను ఎన్ని శాసన లున్నను లాభం లేదు. మనం డబ్బుకి దాసులమయి దానికోసం ఆత్మను అమ్ముకొని బ్రతికాం, అలవాటుపడ్డాం. యెన్నికల విషయం చూస్తే ఏడుపొస్తుంది. ఒక్కసారి అందరూ గుండెలపై చేయేసుకోండి, యెంతమంది నిజాయతీగా వోటు ఇచ్చారు. వాగ్దానముల గాలాలకు చిక్కుకొని కొందరు, స్వార్థపరుల ఉచ్చుల్లో యిరికి కొందరు, స్వార్థానికి లోనై కొందరు వోట్లు ఇచ్చారు. యెత్తులకు చిత్తయ్యే బలహీనతతో ఇంకా వారు తందాన అంటే నేను తందాన అనే పూరి పెద్దలకు యోచన ఉండాలి, ఇదంతా ఇంతవరకూ జరిగిన భాగోతం, త్రవ్విన కొద్దీ పెంకలే, ఇక భవిష్యత్ గూర్చి యోచించాలి. ఈ మారు యెన్నికలలో యెవరిని గెలిపించాలన్నదానికన్న పెద్ద సమస్య మన ముందున్నది. ఆ దొరను గెలువ నియ్యొద్దు, పదవి పుట్టినప్పటినుండి ఏలుతున్న దొర మనకు చేసిన పని యేముంది, అందరూ ఆలోచించండి, ఆ ఒక్కడు తప్ప యెవరు గెలిచిన మనకేం బాధ వుండదు, ఆయననే యెన్నుకొన్నట్లైతే లాభం వుండక పోవడమే కాదు నష్టాలుకూడా చాలా వుంటాయి, అవన్నీ ముందు మీకే బాగా తెలుసు, మనం సమర్థవంతమయిన కృషి చేయాలి కార్యదీక్షతో పథ కాల పథములో నడవాలి, ప్రగతి చూసాకే మనము ఆగాలి, అంతవరకూ ఆకలివప్పున ఏదైన సాగాలి, స్వార్థపరుల ఉచ్చుల్లో ఇరికి బాధ్యతులను మరచి బానిసబ్రతుకులు బ్రతుకొద్దు, ఈ నీచ బ్రతుకులు మన కొద్దు, నేను చెప్పినవన్నీ పాటించితే చాలు తప్పకుండా జరుగుతుంది మేలు.

ఇంకెవరు మాట్లాడ దల్చుకొంటే మాట్లాడండి.

"అరేయ్ రంగన్నా నీవు మాట్లాడు, జనంలోంచి వచ్చాడు. నేను చెప్పేది ఏమీ లేదు అన్నీ మన రాములే చెప్పాడు, వయసులో చిన్నవాడయినా యోచించడంలో మన అందరికన్నా మిన్న, అతడు చెప్పినవన్నీ తు.చ. తప్పకుండా పాటించాలన్నది నా కోరిక. ఈసారి మావూరి సర్పంచ్‌గా రాములును చేద్దాం. అందరూ చప్పట్లు చరిచారు.

మీరంతా చప్పట్లు కొట్టగానే సరిపోదు తప్పటడుగులు వేయకుండా నడవాలి.

* * *

లక్ష్మయ్యా! నీహితవు కోరి చెపుతున్నాను చిన్నవాడు కలిసివున్నపుడు పెంచుకొన్న ప్రేమను త్రెంచుకోలేకనా నీగురించి నా ఆలోచన. నన్ను అపార్థం చేసుకోక అర్థం చేసుకో.

అయ్యా! ఎంతమాట. మీమాటను నేను కాదనలేను మీరు భగవత్ స్వరూపులు.

అని నీవంటున్నావు కాని నీ కొడుకు నన్ను దానవున్ని చేసాడు.

ఆఁ అంత మాటన్నాడావాడు. ఎంతపొగరు వాడి బొక్క లిరగతంతాను.

లక్ష్మయ్యా బొక్క లిరగతన్నే స్థితిని దాటిపోయాడు. కాస్త ఆలోచించే చేయాలి. నేను నిన్ను చూసి వూరుకొంటున్నా లేకపోతే రాములు గతి ఏమయ్యేదో. ఎన్నడో పోలీసుల మర్యాదలని పొందేవాడు.

దొరా అంతపని మాత్రం చేయకండి. వాడిని దారిలోకి తీసుకొస్తాను.

నాకు ఆ నమ్మకముండబట్టే ఇన్నాళ్ళూ ఆగాను. ఈమారు సర్పంచ్ ఎన్నికలలో మీ రాములును నాకు పోటీగా నిలబెట్టే యత్నాలు కొనసాగుతున్నాయ్. పోటీ చేయకుండా మాడడమే నీపని. ఒకవేళ నాకు పోటీ చేసినా గెలవడం జరగదన్నది ఖాయం. నేను వద్దు అని అనడానికి కారణం ఇన్నాళ్ళనుండి ఏకగ్రీవంగా గెల్చిన నాకు పోటీ వుండడం అవమానంగా భావిస్తున్నాను.

అయ్యా! అర్థమయ్యింది. మీరు చెప్పినట్లే చేస్తాను.

చేస్తేనే మంచిది లక్ష్మయ్యా. నేను తెలియకడుగుతాను, ఈ వెధవ రాజకీయాలు మీవాడికెందుకు చెప్పు, బి.ఏ. చదివాడు ఏదయినా ఉద్యోగం చేసుకోక.

ఎవరిస్తారు బాబు ఉద్యోగం, తిరిగి తిరిగి కాళ్ళు అతిగాయి. నోరు మంచిదయితే వూరు మంచిదవుతుంది. మీవాడు బుద్ధిగా వుదిలితే నేను ఆమాత్రం యిప్పించలేనా, మా బావ మంత్రి అన్న సంగతి నీకు తెల్సుకదా. తల్చుకొంటే ఎంతపని. నేను చెప్పినవన్నీ తలకెక్కించుకొంటే తప్పకుండా ఉద్యోగం యిప్పిస్తాను. ఒప్పుకొన్నట్లయితే నన్ను కలవమను.

అలాగే దొరా, మీలాంటి సహృదయులు కోటికి వొక్కరయినా ఉండరేమో, మీరు మాపట్ల చూపుతున్న ఆప్యాయతకు అనురాగాలకు ఉబ్బితబ్బిబ్బయిపోతున్నాను. మీరు చెప్పిన మాట వాడికి చెప్పి వాడిని మీవద్దకు తీసుకొనివస్తా అంటూ నిష్క్రమించాడు మంత్రముగ్ధుడయిన లక్ష్మయ్య—

* * *

"జయా! తలుపు తీయవమ్మా"

"ఆఁ వస్తున్నా"

"లోనికి అడుగు పెడుతూనే ఆ వెధవ ఎక్కడ పోయాడే"

"చావడివద్దకు"

"పోతాడమ్మా చావడిలోకే, నాపరువు చావడిలోకి ఎక్కించాలిగా మరి. వాడికే మాత్రం బుద్ధి అనేది వున్నా నన్నిలా బాధపెట్టడు, ఇదంతా నాకర్మ. వాడినని ఏం లాభం ఎంత చేసుకొంటే అంత."

అదుగో అన్నయ్య వస్తున్నాడు.

"రానియ్ ఇవ్వాళ ఏదో ఒకటి తేలిపోవాలి, అరేయ్ నన్ను చావమంటావా బ్రతుకమంటావా"

అదేం ప్రశ్న నాన్న.

"ప్రశ్న కాదురా నాలో రగులుతున్న ఆవేదనా జ్వాల, నేను బ్రతికున్నన్నాళ్ళు అది నీకు అర్థం కాదురా."

నాన్న మీరనేదేదో నూటిగా అనండి, మిమ్మల్ని బాధపెట్టడం నా అభిమతం కాదు, అంధకారంలో నున్నవారికి వెల్గు బాట చూపాలన్నదే నా ఆశయం, అందుకోసం నేను ఏమయినా త్యాగం చేస్తాను, అడ్డదారులు నేనసలేపట్టను, నా ఆశయానికి అడ్డురాని పని ఏదయినా చేయడానికి సిద్దమే, మీరు అనవసరంగా ఆందోళన పడుతున్నారు, నేనేదో తప్పు చేస్తున్నట్లు మీరు బావిస్తున్నారు, నేను చేసేది ఏమయినా తప్పా నాన్న.

అవునురా నావన్నీ అనవసరపు ఆందోళలే, నీ వన్నీ అత్యవసరపు ఆలోచనలు, అటు చూడురా పెళ్ళి కాని చెల్లె, "ఇరువై సంవత్సరాలొచ్చినా ఇంటిమీద కూతురు నుంచుకొన్నాడు, వాడొకోడు కనిపున్నాడు ఎందుకూ కొరగాని వాడు" అని లోకం ఇనుపమూతి కాకి అయి పొడుస్తుంటే నేను పడే ఆవేదన నీకేం తెలుస్తుందిరా, దీర్ఘంగా యోచించాలిరా రాములు, నీ ఆశయాలు మనకు అన్నం పెట్టవు నీ స్థితి నొక్కసారి వెనుదిరిగి చూసుకోరా"

నన్నిపుడేం జేయమంటారు నాన్న.

"చేయ మనేది ఏముంది కాని చేసేటివి వద్దంటున్నాను"

"నేనేం చేస్తున్నాను."

"అవే సభలురా"

"అంధకారంలో అలమటించేవారికి అండ నిలిచి వెలుగుబాట నడుస్తూ రమ్మని అనడం దోషమా."

"అరేయ్ వాళ్ళకు వెలుగు చూపించబోయి నీవే అంధకారంలో చిక్కుకొని తల్లడిస్తావురా" నేను యివ్వాళ దొర పిలిపించితే వెళ్ళాను, వారు ఎంత చక్కగా చెప్పారు, అంత ధనముంటే వినయాన్ని వీడలేదు, చిన్నప్పుడు మాట్లాడినట్లే మాట్లాడారు, అలాంటివారిని నీవు అపార్థం చేసుకొని ఏమేమో మాట్లాడుతుంటావు."

నాన్న మీరు మత్తులో మునిగిపోయారు, నాలుగు తీయని మాటలతో మీలోకి విషాన్ని ఎక్కించారు ఒక్కసారి గుర్తు తెచ్చుకొండి గతాన్ని, నడిబజార్లో మిమ్మల్ని కొట్టిన రోజు ఇప్పుడు గుర్తుకు రావడంలేదా?



ప్రకాశ్ ఆర్ట్స్ పిక్చర్స్ వారి
"పెళ్ళికాని తండ్రి" చిత్రంలో
[illegible]ప్రభ – ఎం. రంగారావు.

లక్ష్మయ్యకు ఏమనాలో తోచలేదు, దొర అన్న మాటలపై నమ్మకం పోవడం లేదు, నీ కొడుక్కు ఉద్యోగం ఇస్తానన్న ఒక్క మాట చాలు, దొర మంచివాడనుకోనేందుకు. ఇవి లక్ష్మయ్య మనసులోని మాటలు.

"అప్పుడేదో జరిగింది ఆ సంగతి ఇప్పుడెందుకు, నీకు ఉద్యోగం వస్తుంది, పోయి కలువు."

నేను వెళ్ళను.

ఎందుకు వెళ్ళవు?

నేను ఉద్యోగం చేయను.

ఏం పని?

కూలి పని.

అందుకే పనికొస్తావు, చిన్నప్పుడునుండి కన్నుల్లో వత్తులేసుకొని పెంచినందుకు మంచి సమర్థుడవైతివని మురిసిపోతున్నమురా అని ఆవేశంగా అంటూనే గుండె చేత్తో పట్టుకొని కూలబడ్డాడు.

అయ్యో అని అంటూనే అందుకొని బెడ్ పై చేర్చాడు.

అన్నయ్యా! తండ్రిగారి స్థితి దిన దినం క్షీణిస్తున్నది విశ్రాంతి అవసరమని డాక్టరుగారు చెప్పారు తండ్రిగారికి అదే కరువయ్యింది.

మౌనమే సమాధాన మిచ్చింది రాములుకు. చైర్లో ఏవో యోచిస్తూ కూర్చున్నారు.

* * *

సర్పంచ్ వచ్చి రాములుని తన వలలో వేసుకున్నాడు. రాములు ఆశయం మట్టిపాలయింది. పరిస్థితి తన ఆదర్శానికి ఎదురైంది. అంతే, మళ్ళీ దొరే సర్పంచ్.

## గమనిక

"కథాంజలి"లో వెలువడే కథలన్నీ కేవలము కల్పితము. ఎవరినీ ఉద్దేశించివ్రాసినది కాదు. రచయితల రచనలకు మేము ఏమాత్రము భాద్యులు కాదు. —సంపాదకుడు.

# అప్పటికి - - ఇప్పటికీ?

* రచన: "స్వాతి" *

గోపాల్ ఒక చిన్న రచయిత. కాని ఇంత వరకు ఒక కథకూడ ప్రచురింపబడలేదు. జోకులు మాత్రం ప్రచురింపబడ్డాయి. అవి కూడ అతని కలం పేరుతో ప్రచురింపబడ్డాయి.

ఒక చల్లని సాయంకాలం దాదాపు ఆరు గంటలు అయివుంటుంది, గోపాల్ మ్యాట్నీ చూసి వస్తున్నాడు, అతడు ఇల్లు చేరేలోగా అతనికి ఒక మంచి అయిడియా వచ్చింది.

ఇంటికి రాగానే కాగితం, కలం తీసుకొని తన ఊహను ఒక చిన్న కథగా మలిచాడు, ఆ కథను యువ రచయితలకు ప్రోత్సాహ మిస్తామని ప్రకటించిన ఒక ప్రముఖ పత్రికకు పంపించాడు తన కలం పేరుతో. ఆ కథ ప్రచురించబడుతుందనే ఆశ వుంది.

తన కథ పంపినప్పటినుంచి వారం వారం పత్రికను చూడడం అతని హాబీగా మారింది.

గోపాల్ కథను పంపించి రెండు మాసాలు దాటింది, ఆ కథ ఆ పత్రికలో ప్రచురింపబడలేదు, తిరిగి రాలేదు, అప్పుడు గోపాల్‌కు ఒక చిన్న అనుమానం వచ్చింది, ఇంతకూ ఆ కథ పత్రికవాళ్ళకు చేరిందో! లేదో! అని.

అప్పుడు గోపాల్ పోస్టు అఫీసు కెళ్ళి, రెండు కవర్లు కొని ఆ పత్రికవాళ్ళ కొక ఉత్తరం వ్రాశాడు, అదే కవర్లో తన స్వంత అడ్రస్ గల కవరుకూడ పెట్టి పోస్టు చేశాడు.